క్లుప్తంగా

నేడు వాలీబాల్ టోర్నీ

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ గ్రామంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం మండల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భూపాల్‌రెడ్డి, శేఖర్, నవనీత్, శేఖర్‌గౌడ్, రవికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 ఇస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ సొంత గ్రామం జట్టులోనే ఆడాల్సి ఉంటుందని వివరించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

- ఉపవాస దీక్షాపరులకు ఫలహారం అందించిన నూరుల్ హసన్



స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో మతసామరస్యం వెల్లివిరిసింది. ఉపవాస దీక్షాపరులకు ఈద్గా కమిటీ ఉపాధ్యక్షుడు నూరుల్ హసన్ బాయమ్మతోటలో ఫలహారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. పండుగలతో సోదరభావం పెంపొందుతుందని అన్నారు. నూరుల్ హసన్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్, మైనార్టీ నాయకులు హనీఫ్ అహ్మద్, సమద్‌ఖాన్ తోపాటు ఎస్‌ఎం.ఖలీల్, నిజాముద్దీన్, ఎంఏ.రహీం పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

నవాబుపేట: ఆలయంలో అసభ్యంగా ప్రవర్తించడంతో ఓ యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. తిర్మలాపూర్‌కి చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి మండలంలోని కొల్లూర్‌లో ఉన్న భవాని మాత ఆలయంలో అమ్మవారి విగ్రహం వద్ద అనుచితంగా ప్రవర్తించాడు. గమనించిన గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

'విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను గుర్తించాలి'

మరికల్: మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్ట మైసమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు హరీష్, వెంకటేష్‌గౌడ్, నర్సింహులు, కొండప్ప అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మరికల్‌లో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని, అమ్మవారి విగ్రహం ధ్వంసం చేయడం వెనక ఎవరికుట్ర ఉందో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వీరసావర్కర్‌కు నివాళి

నారాయణ పేట టౌన్: వినాయక్ దామోదర్ వీరసావర్కర్ వర్ధంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ నాయకులు పట్టణంలోని సావర్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షులు డా.రాంబాబు మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరికో ఆదర్శంగా నిలిచి ధైర్యశాలి వీరసావర్కర్ అని కొనియాడారు.

బిడ్డకు జన్మనిచ్చిన తొమ్మిదో తరగతి విద్యార్థిని

మద్దూరు: మండలంలోని ఓ తండాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థిని తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లగా.. తన నాన్నమ్మ వద్ద ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ముంబై నుంచి గ్రామానికి వారం రోజుల క్రితం వచ్చారు. అయితే విద్యార్థినికి థైరాయిడ్ సమస్య ఉండటంతో వారు కూడా ఎక్కువగా పట్టించుకోలేదు. బుధవారం ఒక్కసారిగా కడుపు నొప్పి రావడంతో ద్విచక్ర వాహనంపై మద్దూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చారు. ఆస్పత్రిలోని బాత్‌రూంలోకి వెళ్లిన విద్యార్థిని.. అక్కడే మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే డాక్టర్ రహీం వైద్యసేవలు అందించారు. బాలిక శిశువుకు జన్మనిచ్చిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు శిశువుని వదిలేద్దామని నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఉన్న వారితో పాటు చాలా మంది అక్కడికి వచ్చి శిశువుని ఇవ్వాలని అడగడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లిబిడ్డను మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని డాక్టర్ తెలిపారు. కాగా, అదే తండాకు చెందిన ఓ యువకుడి కారణంగా విద్యార్థిని గర్భం దాల్చినట్లు తెలిసింది.



జడ్చర్ల మండలంలోని పరుశువేదీశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



దేవరకద్రలో విద్యుద్దీపాల వెలుగులతో శివాలయం



గండేడ్ మండలం అంతర్‌గంగ వద్ద..

హరహర మహాదేవ..

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- అభిషేకాలు, ప్రత్యేకపూజలు
- శివపార్వతుల కల్యాణం
- మార్మోగిన శివ నామస్మరణ
- భక్తుల ఉపవాస దీక్షలు

సాక్షి నెట్‌వర్క్: హరహర మహాదేవా.. శంభో శంకర.. అన్న నామస్మరణలతో బుధవారం జిల్లా వ్యాప్తంగా శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జడ్చర్ల మండలంలోని మీనాంబరం పరుశవేదీశ్వర స్వామి ఆలయానికి 50వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. శివగిరిక్షేత్రాన్ని జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి దర్శించుకొని అభిషేకాలు చేశారు. పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

■ మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం (పెద్ద శివాలయం)లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకామాక్షీఏకామ్రేశ్వర, రాజేంద్రనగర్‌లోని శివాలయం, మోనప్పగుట్టలో గల శ్రీమౌనీశ్వరస్వామి, సింహగిరిలోని ఐశ్వర్యేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. ఏనుగొండలోలోగల సాంబ శివాలయం, శ్రీనివాస కాలనీ పంచముఖాంజనేయ స్వామి ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

■ మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలోని పెద్ద శివాలయం తోపాటు బీకేరెడ్డికాలనీ, శివశక్తినగర్‌లోని శివాలయాలు, కలెక్టర్ బంగ్లా సమీపంలోని మౌనేశ్వర ఆలయం, పద్మావతికాలనీలోని మార్కండేయ స్వామి ఆలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎదిర శివారులోని పురాతన శివాలయంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. వేంకటేశ్వరకాలనీలోని సాయిబాబా ఆలయంలో ఏర్పాటుచేసిన శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్లు రోజా, ఎ.అంజయ్య, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, రఘు, గోటూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.

■ హన్వాడ మండలకేంద్రంలోని శ్రీఆంజనేయ స్వామి, బాలాజీకొండ, సంగమేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

■ నవాబుపేటలోని కాశీనాధుడి ఆలయంలో పూజారి రామేశ్వరయ్య ప్రత్యేక పూజలు చేశారు. మరికల్‌లోని కోటచింతల బసవేశ్వరాలయం, ఇప్పటూర్ శివాంజనేయస్వామి, లోకిరేవు వీరభద్రాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



మూసాపేట రామలింగేశ్వరాలయంలో..

■ జడ్చర్లలోని భాగ్యేశ్వరాలయం, త్రిలింగేశ్వరాలయం, కాశివిశ్వేశ్వరాలయం, కావేరమ్మపేట, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయం శివనామస్మరణతో మార్మోగాయి. శివగిరిక్షేత్రంతోపాటు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చలమేశ్వరస్వామి ఆలయంలో గిరిజనులు, త్రిలింగేశ్వరాలయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత దర్శించుకున్నారు. భాగ్యేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం జరిపించారు.



మహబూబ్‌నగర్‌లోని పెద్ద శివాలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

■ మూసాపేటలోని రామస్వామిగుట్టపై వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. భక్తుల జాగారం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

■ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్, మన్సూర్‌పల్లి, కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, పెద్దవార్వాల్, పగిడ్యాల్‌ల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడింది. ఉపవాస దీక్షలు ఉన్నవారు సాయంత్రం శివాలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి ఉపవాసాలు విరమించారు. అంతర్‌గంగ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం పూజలు, సాయంత్రం శకటోత్సవం, కల్యాణం జరిపించారు.

■ మహమ్మదాబాద్‌తో పాటు నంచర్ల, గాధిర్యాల్, వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లిలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో భక్తులు కిక్కిరిశారు.

■ భూత్పూర్‌తో పాటు వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పంచామృతాలతో అభిషేకం చేశారు.

■ చిన్నచింతకుంటతో పాటు చిన్నవడ్డేమాన్ రామలింగేశ్వరాలయం, లాల్‌కోట, తిరుమలాపురం, అప్పంపల్లిలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ రాజాపూర్‌లోని శివాంజనేయస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. తిర్మలాపూర్, రాయపల్లి, చొక్కంపేట్, కుచ్చర్‌కల్, చెన్నవెల్లి, రంగారెడ్డిగూడలోని శివాలయాల్లో భక్తులు ఉపవాస దీక్షలతో శివుడికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొప్పెరిబచ్చిరెడ్డి, అచ్చయ్యగుప్తా, కృష్ణయ్య, నరహరి, గోవర్ధన్‌రెడ్డి, రమణ, పాల్గొన్నారు.

■ బాలానగర్‌తో పాటు పెద్దరేవల్లి, చిన్నరేవల్లి, బోడజానంపేట, మోతిఘనాపూర్, ఉడిత్యాల గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

■ మిడ్జిల్‌తో పాటు వాడ్యాల్, వేముల, మున్ననూర్, మసిగొండ్లపల్లి, వస్పుల, దోనూర్‌లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

■ కోయిల్‌కొండ మండల వ్యాప్తంగా శివరాత్రిని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో మహారుద్రాభిషేకం, లింగోద్భవ పూజలు పూజారులు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

■ దేవరకద్రలోని ఈశ్వర వీరప్పయ్య దేవాలయం వద్ద రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలకరించారు.



భూత్పూర్ మండలం కర్వెనలో..



శివగిరిక్షేత్రంలో జిల్లా జడ్జి పాపిరెడ్డి



బీకేరెడ్డి కాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



రాజాపూర్‌లో శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు



మహబూబ్‌నగర్‌లో..



కోయిల్‌కొండలో..



నవాబుపేట మండలం మరికల్‌లోని..

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న పార్వతీపరమేశ్వరులు



గద్దెగూడెంలో కొనసాగుతున్న రామలింగేశ్వరస్వామి రథోత్సవం

దేవరకద్ర: మండలంలోని గద్దెగూడెంలో బుధవారం రామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని దేవాలయంలో రెండు రోజులుగా ఉత్సవాలను నిర్వహించారు. తెల్లవారుజామున బాణసంచా కాలుస్తూ భక్తులు స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. రెండు గంటలకు పైగా రథోత్సవ కార్యక్రమం కొనసాగింది. ఆలయంలో భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా జాగరణ కోసం దేవాలయంలో అఖండ భజన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

కందూర్‌లో పోటెత్తిన భక్తులు



కందూర్ ఆలయంలో ఎస్పీ జానకి

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయానికి శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం భక్తులు పోటెత్తారు. కోనేరులో స్నానాలు చేసి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. గౌరమ్మ ఆలయంలో పూజలు చేసి ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టు భక్తులు ప్రదక్షిణ చేశారు. ఎస్పీ జానకి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘనస్వాగతం పలికి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషస్తకం, పూజలు చేయించారు. ఈఓ రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో పండితులు తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. అడ్డాకుల ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఆలయంలో క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

దేవాలయానికి రూ. 1.51లక్షల విరాళం

దేవరకద్ర: స్థానిక ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల సముదాయం పునర్నిర్మాణం, గోపుర నిర్మాణం కోసం దేవరకద్రకు చెందిన సాయిబాబా, మంజుల, అశోక్‌కుమార్, కల్యాణి దంపతులు బుధవారం రూ. 1,51,116 విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. దేవస్థాన అధికారి సూరిబాబు, పూజారి నాగరాజుస్వామి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గండేడ్/మహమ్మదాబాద్: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం గండేడ్ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మహమ్మదాబాద్, గండేడ్ మండలాలకు చెందిన పలు పేద విద్యార్థులకు రూ.2500 చొప్పున చెక్కులు అందజేశారు. విశ్వేశ్వర్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, మూస నర్సింహ, కృష్ణ, నరహరిరెడ్డి, కాశీనాథ్, మల్కయ్య, భద్రేశ్వర్, ఏముక రవీందర్, సంటెం వెంకటయ్య, సంతోష్‌కుమార్, రాజు, భీమయ్య, శీను, నర్సింహులు, మైబు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాపూర్: అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శివానంద్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. మండలంలోని నందిగామ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఓట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను నింపుకొని వెళ్తున్నారు. పోలీసులకు ఎదురుపడగా ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు అడిగారు. డ్రైవర్ వంశీ ఎలాంటి పత్రాలు లేవని తెలిపాడు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. జిల్లాలోనే ఇసుక రవాణా నిషేధం ఉందని, ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదకరంగా కల్వర్టు



గండేడ్: మండలంలోని వడ్డెగుడిసెల వద్ద రోడ్డు ప్రమాదకర మలుపు ఉండటంతో పాటు కల్వర్టు కూడా ప్రమాదకరంగా ఉంది. జక్లపల్లి–మొకర్లాబాద్ రోడ్డు ఈ గ్రామాన్ని అనుకొని వెళ్తుంది. ఈగ్రామం వద్ద రోడ్డు రెండు మూడుచోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం ముందు కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు గోడ ఎత్తు లేదు. అలాగే లోతు కూడా ఎక్కువగా ఉంది. ఇక్కడ నాలుగైదేళ్ల లోపు చిన్నారులు ఉన్నారు. వారు ఎపుడు బయటికొచ్చి కల్వర్టు వద్దకు వెళతారో ఎక్కడ ప్రమాదం బారినపడతారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎక్కువ ఎత్తులో గోడ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.